

మహమ్మారి విస్తరిస్తోంది

కిడ్నీ వ్యాధి గిరిజన ప్రాంతాలకు కూడా విస్తరిస్తోంది. దీంతో వారిలో భయాందోళన నెలకొంది.

- 8లో

ఆదిత్యాలయ ఈఓగా భద్రాజీ



అరసవల్లి: అరసవల్లి ఆదిత్యాలయ ఈఓ/డిప్యూటీ కమిషనర్‌గా వై.భద్రాజీ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం అనంతపురం జిల్లా నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ ఈఓగా పనిచేస్తూ బదిలీపై వస్తున్నారు. ఇక్కడ రెగ్యులర్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబును కాకినాడ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు.

జిల్లా మైన్స్ శాఖాధికారిగా మోహనరావు

అరవసల్లి: జిల్లా మైన్స్ అండ్ జియాలజీ విభాగ అధికారిగా చౌటపల్లి మోహనరావును కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే టెక్కలి డివిజనల్ కార్యాలయ మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.బాలాజీ నాయక్‌కు తిరుపతి జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారిగా నియమించారు. అలాగే మైన్స్ కార్యాలయ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.విజయలక్ష్మిని టెక్కలి డివిజనల్ కార్యాలయ ఎ.డిగా బదిలీ చేశారు.

న్యూస్‌రీల్

వెంటాడుతున్న మద్యం కొరత

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం కొరత వెంటాడుతోంది. ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం గోదాం నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఈ నెల 18 నుంచి సరఫరా నిలిపివేశారు. మద్యం సరఫరా చేసే ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు రవాణా బకాయిలు కొన్ని నెలల నుంచి చెల్లించాల్సి ఉంది. వీరికి చెల్లించకపోవటంతో వీరు ట్రాన్స్‌పోర్టు సేవలకు దూరంగా ఉన్నారు. సోమవారం ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఇండెంట్, డిమాండ్ మేరకు తక్కువ ధరకు మద్యం సరఫరా చేస్తారా? లేదా ? అన్నది చూడాలి. మరో పక్క ప్రభుత్వం ప్రైవేట్ మద్యం విధానం అక్టోబర్ 1వ తేదీ నుంచి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మరో ఎనిమిది రోజుల పాటు మద్యం నిలిపివేసి, ప్రైవేట్ విధానం కొనసాగించే అవకాశం ఉందని కొందరు అంటున్నారు.

దేవుడిని రాజకీయానికి వాడుకోవడం బాబుకే చెల్లింది



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నాణ్యతలో అనుమానాలు ఉన్నాయని టీటీడీ గుర్తించి వాడకుండా నిలిపివేసిన నెయ్యిని చూపి ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వం పైన దుష్ప్రచారం చేస్తూ మాట్లాడడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వాడని నెయ్యి, తయారుకాని లడ్డూలు పట్టుకొని లడ్డూ తయారీలో కొవ్వు కలిసిందని, మరేదో కలిసిందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దిగజారి మాట్లాడుతుండటాన్ని కృష్ణదాస్ ఖండించారు. దేవుడిని రాజకీయాలకు వాడుకోవడం బాబుకే చెల్లిందన్నారు. ఇంతకుఇంత అనుభవిస్తారని అన్నారు. నిజానిజాలు తేలాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారానికి వచ్చారని, బాధ్యతలు చేపట్టి వంద రోజులు అవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోవడంతో ప్రజలకు సమాధానాలు చెప్పలేక వారి దృష్టి మరల్చడానికి ఈ విధంగా తిరుమల దేవుడిని వినియోగించుకోవడం దారుణమన్నారు. విమర్శలు ఆపి ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ప్రయత్నించాలని కృష్ణదాస్ సూచించారు.

వైద్య రంగంపై ఎందుకంత కక్ష?



సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి వైద్యారోగ్య రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడానికి ఉపక్రమించడం, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ సీట్లు నిరాకరించడం, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రులు, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు ప్రైవేటు పరం చేయమని ఆదేశించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు ఇన్ సర్వీస్ కోటా తగ్గించడం వంటివి హేయమని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా, నెట్‌వర్క్ ఆస్పత్రులను ప్రభుత్వమే బ్లాక్ మెయిల్ చేయడం, ఆరోగ్యశ్రీని సైతం నిలుపుదల చేసి, ప్రైవేటు భీమా సంస్థలకు కట్టబెట్టడం వంటివి మానుకోవాలని హితవుపలికారు. నేరుగా వైద్యులు, వైద్య విద్యార్థుల మీద దాడి చేసి భయాందోళనలు సృష్టించడం దారుణమని పేర్కొన్నారు. దశాబ్ద కాలానికి పైగా వైద్య విద్యను అభ్యసించి, అనంతరం రాత్రి పగలు తేడా లేకుండా అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న వైద్యులపై దాడులా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు దీనికి కచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్ సాక్షిగా టీడీపీ నాయకుడి దౌర్జన్యం



కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎదురుగా గాయాలతో మోహనరావు

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురం గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయంపై ఇటీవల కాశీబుగ్గ గ్రీవెన్సులో ఎస్పీకి కూడా చెప్పారు. పరస్పరం ఫిర్యాదు చేసుకోగా ఆదివారం విచారణ నిమిత్తం ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. అయితే అక్కడ కూడా రెండు వర్గాల వారు గొడవపడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బూర్లె మోహనరావుపై టీడీపీ నాయకుడు బూర్లె సూర్య కృష్ణంరాజు దాడి చేశాడు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కాశీబుగ్గ పోలీసులు రెండు వర్గాల్లో 13 మందిపై కేసు నమోదు చేశారు.

జెడ్పీ సీఈఓగా శ్రీధర్ రాజా



శ్రీధర్ రాజా



అరసవల్లి: జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖలో కీలక ఉద్యోగుల బదిలీల ప్రక్రియలపై ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన విజయనగరం జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తూ ఇక్కడకు సాధారణ బదిలీల్లో భాగంగా రానున్నారు. అలాగే విశాఖ జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న డి.సత్యనారాయణను స్థానిక జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన ఆర్.వెంకట్రామన్‌ను విజయనగరం జెడ్పీ డిప్యూటీ సీఈఓగా బదిలీ చేశారు. డివిజినల్ పంచాయతీ అభివృద్ధి అధికారులను కూడా పలు ప్రాంతాలకు బదిలీ చేశారు. శ్రీకాకుళం డీఎల్‌డీఓగా పనిచేస్తున్న పి.వాసుదేవరావును కాకినాడ డీఎల్‌డీఓగానూ, టెక్కలి డీఎల్‌డీఓగా పనిచేస్తున్న ఎల్.అలివేలు మంగమ్మకు భీమునిపట్నం డీఎల్‌డీఓగానూ, డీఎల్‌డీఓ హోదాలో ఉన్న డ్వామా పీడీ జీవీ చిట్టిరాజును పలాస డీఎల్‌డీఓగానూ, అలాగే డీఎల్‌డీఓ కొత్తకోట హేమసుందరరావుకు విజయనగరం జిల్లా చీపురుపల్లి డీఎల్‌డీఓగానూ, అలాగే మెప్మా పీడీగా పనిచేసిన ఎం.కిరణ్‌కుమార్‌ను విజయనగరం జిల్లా బొబ్బిలి డీఎల్‌డీఓగా బదిలీ చేశారు.

జిల్లా పంచాయతీ అధికారిగా భారతీ సౌజన్య

అరసవల్లి: జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా కె.భారతీ సౌజన్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా కాకినాడలో డీపీఓగా విధుల్లో ఉన్న భారతీ సౌజన్యను శ్రీకాకుళంకు బదిలీ చేశారు. కాగా ఇక్కడ ఇంత వరకు డీపీఓగా పనిచేస్తున్న టి.వెంకటేశ్వరరావును విజయనగరం డీపీఓగా బదిలీ చేశారు. ఆమె సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా ఇషాన్ బాషా

అరసవల్లి: గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ)గా ఇషాన్ భాషాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన అనంతపురంలో బోర్డు మెంబర్ సెక్రటరీగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు రానున్నారు. అలాగే శ్రీకాకుళం డివిజన్ ఈఈగా ఎ.రంగప్రసాద్‌ను నియమించారు. ఈయన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఈఈగా పనిచేసి ఇక్కడకు రానున్నారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈగా మహ్మద్ నిషాత్ హుస్సేన్‌ను నియమించారు. ఈయన విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలో ఈఈగా విధుల్లో ఉండగా, పదోన్నతిపై ఇక్కడకు వస్తున్నారు. ఈయన అక్టోబర్ 1న జిల్లాలో బాధ్యతలు స్వీకరించనున్నట్లుగా కార్యాలయ వర్గాలు తెలియజేశాయి.

డ్వామా పీడీగా సుధాకరరావు



సుధాకరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులుగా డీఎల్‌పీఓ బి.సుధాకరరావుని ప్రభుత్వం నియమించింది. ఈయన ఇప్పటి వరకు విజయనగరం మెప్మా పీడీగా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం డ్వామా పీడీ జీవీ చిట్టిరాజుకి బదిలీ అయ్యింది. ఆయనను పలాస డివిజన్ డీఎల్‌డీఓగా నియమించారు. ఆయన స్థానంలో సుధాకరరావు రానున్నారు.

ఇల్లు లేదు.. బిల్లూ లేదు



- రూ.65 కోట్ల బకాయి విడుదల కోసం ఎదురుచూపులు
- వంద రోజులైనా పట్టించుకోని ప్రభుత్వం
- గతంలో జిల్లాలో 75,840 ఇళ్ల మంజూరు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

పేదలకు ఇళ్ల సంగతి తర్వాత.. కనీసం వాటి బకాయి బిల్లులు చెల్లించేందుకు కూడా కూటమి ప్రభుత్వం ఇష్టం చూపడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సొంతింటి ఆశలపై నీళ్లు జల్లారు. కొత్తగా ఏమీ ఇవ్వకపోగా.. గత ప్రభుత్వం స్థలం ఇచ్చి నిధులు మంజూరు చేసిన వారికి కూడా బకాయి బిల్లులు చెల్లించడం లేదు.

కూటమి పాలనకు వంద రోజులు గడిచినా ఎక్కడా ఒక్క పునాది కూడా వేయలేదు. పేదల ఇళ్ల పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ఎన్నికల ముందు రెండు సెంట్లకు తక్కువ లేకుండా స్థలం మంజూరు చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను మరిచారు. వంద రోజుల్లో ఒక్కసారి కూడా ఈ పేదల ఇళ్లపై ప్రస్తావన లేదు. అంతే కాదు పనులు చేసిన వారి బిల్లుపై కూడా మంత్రులు, అధికారులు మాట మాత్రమైనా చెప్పడం లేదు.

గతంలో ఇలా..

వైఎస్సార్ సీపీ హయాంలో 30 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో 75,840 ఇళ్లు మంజూరు చేశారు. వీటికి గాను 834 లే అవుట్‌లను ప్రభుత్వం వేసింది. వీటిలో 38,773 ఇళ్లను మంజూరు చేశారు. సొంత స్థలం ఉన్నవారికి 37,067 ఇళ్లను మంజూరు చేశారు. ఈ ఇళ్లలో చాలా వరకు ఇప్పటికే ఆ ప్రభుత్వం పూర్తి చేసింది. ఇప్పటికే 38,942 పూర్తి చేసి, లబ్ధిదారులు అందులోనే ఉంటున్నారు. మరో మరో 5,475 ఇళ్లకు శ్లాబులు వేశారు. 5975 ఇళ్లు శ్లాబ్ లెవెల్ వరకు కట్టారు. మిగిలినవి బేస్‌మెంటు, లింటల్ లెవెల్‌లో నిర్మాణంలో ఉన్నాయి.



జిల్లాలో ఇళ్ల బకాయిలు రూ.65 కోట్ల వరకు ఉన్నాయి. ఈ డబ్బులు విడుదల చేస్తే చాలా మంది పేదలకు ఓ శాశ్వత చిరునామా లభిస్తుంది. కానీ ప్రభుత్వం మాత్రం దీన్ని పట్టించుకోవడమే లేదు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇవ్వడంతో పాటు ఆ స్థలంలో వేగంగా నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. ఎన్నికల ముందు వరకు జిల్లాకు సంబంధించి ఇళ్ల నిర్మాణానికి రూ.735.29 కోట్లను విడుదల చేసింది. ఆ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలు శర వేగంగా జరిగాయి. ఇప్పుడు మందకొడిగా సాగుతున్నాయి.

25న చెకుముకి సైన్స్ సంబరాలు

శ్రీకాకుళం: చెకుముకి సైన్స్ సంబరాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలని ప్రజా సైన్స్ ఉద్యమ జాతీయ కమిటీ సభ్యులు జి.మురళీధర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం యూటీఎఫ్ భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాల సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ఈ నెల 25న జిల్లాలోని 30 మండలాల్లో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో 25 వేల మంది విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ చెకుముకి పోటీలకు ప్రధానోపాధ్యాయులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్.సాయి శ్రీనివాస్, రామకృష్ణ, ఏపీ జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, ఏపీ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, చెకుముకి జిల్లా కన్వీనర్ పి.కూర్మారావు, జేవీజీ గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, జనార్ధనరావు, వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి సైన్స్ సంబరాల కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 28 వరకు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. రూ.200 ఆలస్య రుసుంతో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేయించుకున్న తర్వాత వచ్చిన రిఫరెన్స్ నంబర్ ఆధారంగా ప్రవేశ ఫీజులను అభ్యర్థులు స్వయంగా వెళ్లి ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు సమీపంలోని స్టడీ సెంటర్లకు వెళ్లి కోఆర్డినేటర్లను సంప్రదించాలని కోరారు. మధ్యలో చదువు మానేసినవారు, గృహిణులు, వ్యాపారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ కార్యకర్తలు ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభ్యాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య సూచించారు.

హెచ్ఎంలదే పెట్టుబడి



- విడుదలవ్వని పాఠశాల నిర్వహణ గ్రాంటు
- చాక్‌పీస్, డస్టర్, రిపేర్లకూ ఇబ్బందులే
- ప్రధానోపాధ్యాయులే భరించాల్సిన పరిస్థితి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహణ గ్రాంటు విడుదల చేయాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు దాటినా ఇంకా ఆ గ్రాంటు విడుదల చేయలేదు. దీంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే చాక్‌పీస్, డస్టర్, మైనర్ రిపేర్ల ఖర్చులు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిధులు ఎప్పటికి విడుదల చేస్తుందోనన్న అయోమయంలో వారున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గురుకుల, కేజీబీవీ పాఠశాలలు 2267 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 1,55,400 మంది చదువుతున్నారు. స్కూల్ అవసరాల నిమిత్తం ఏ ప్రభుత్వం ఉన్నా ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తుంది. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదలవుతాయి. ఆ నిధులు తరగతి గదుల్లో అవసరమయ్యే చాక్‌పీస్, డస్టర్, ఏవైనా మైనర్ రిపేర్లు ఉంటే వాటి కోసం ఉపయోగిస్తారు. అయితే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ నిధులను విస్మరించింది.



హిరమండలంలోని సవరచొర్లంగి ప్రాథమిక పాఠశాల

విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు

పాఠశాలల్లో 20 మంది లోపు విద్యార్థులు చదువుతుంటే రూ.10వేలు, 21నుంచి 49 లోపు విద్యార్థులు చదువుతుంటే రూ.15వేలు, 50నుంచి 100లోపు రూ.20వేలు, 101నుంచి 250 లోపు రూ.50వేలు, 251నుంచి 100లోపు రూ.75వేలు, 1000పైన విద్యార్థులు చదువుతుంటే రూ.లక్ష దాకా నిధులు విడుదల చేస్తారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో పాఠశాలల నిర్వహణ గ్రాంటుకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. సకాలంలో నిధులు వచ్చేవి. పాఠశాలల్లో అవసరమైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించేవారు. పాఠశాలల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేది.

ఎదురుచూపులే మిగిలాయి..

ఓ వైపు తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారో ఎవరూ చెప్పడం లేదు. ఈ ఏడాదికి ఉంటుందో ఉండదో కూడా స్పష్టత లేదు. ఒక వేళ ఆ డబ్బు ఇవ్వకుంటే నిర్వహణ గ్రాంటు పరిస్థితి ఏంటోనని పలువురు పేర్కొంటున్నారు. నిధులు మంజూరు కాకపోతే రానున్న రోజుల్లో పాఠశాల నిర్వహణ కష్టతరమవుతుందని వాపోతున్నారు.



ఇంత వరకు రాలేదు

పాఠశాల నిర్వహణ గ్రాంటు ఇంతవరకు విడుదల కాలేదు. చాక్‌పీస్‌లు, డస్టర్లు, మైనర్ రిపేర్లు వంటి వాటికి చేతి నుంచి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో నిధులు విడుదలవుతాయని చెబుతున్నారు.

– టి.కేశవరావు, ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిరమండలం

ఉద్యోగాల మోసాలపై విచారణకు ఆదేశం

అరసవల్లి: వైద్య శాఖను ఓ కుదుపు కుదిపేసిన ఉద్యోగాల మోసాలపై ఎట్టకేలకు డీఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి చర్యలకు ఉపక్రమించారు. వైద్య శాఖకు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగి జీవీ నరసింహం (సింహం) చేతిలో మోసపోయిన నగరానికి చెందిన ఓ మహిళ ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై 'సాక్షి'లో వస్తున్న వరుస కథనాలతో జిల్లా వ్యాప్తంగా సంచలనమైంది. ఇప్పటికే బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు నరసింహంపై పోలీసు కేసు నమోదు కావడంతో ఇక వైద్యశాఖాపరంగా బాధ్యులపై చర్యలు చేపట్టేందుకు వీలుగా ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టాలంటూ వైద్యారోగ్య శాఖాధికారి మీనాక్షి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విచారణాధికారిగా అడిషినల్ డీఎంహెచ్ఓ డాక్టర్ తాడేల శ్రీకాంత్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ విచారణలో ముఖ్యంగా ఉద్యోగాలు ఇప్పిస్తామన్న కోణం, నకిలీ జాయినింగ్ ఆర్డర్ల తయారీ, ఫేక్ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందడం, ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాల జారీ తదితర వివరాలతో పాటు ఆస్పత్రిలో ఉన్న బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయనున్నారు. అలాగే ఈ అక్రమ వ్యవహారాల్లో సంబంధం ఉన్న శాఖకు చెందిన ఇతర కీలక ఉద్యోగుల వ్యవహారాలను కూడా తేల్చనున్నారు.






విచారణకు ఆదేశించాం

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరిగిన వరుస అక్రమాలపై బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించాం. అడిషినల్ డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్‌ను విచారణాధికారిగా నియమించాం. తక్షణమే విచారణ జరిపి నివేదికను జిల్లా కలెక్టర్, వైద్య శాఖ ఉన్నతాధికారులకు నివేదించనున్నాం.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్ఓ

కాంట్రాక్టు ఉద్యోగి పాపం పండింది



శ్రీకాకుళం క్రైమ్ : డీఎంహెచ్ఓలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగమని ఓ వివాహితను నమ్మించాడు. ఫేక్ ఆర్డర్ కాపీ ఇచ్చి ఉద్యోగం వచ్చేసిందని నమ్మబలికాడు. నాలుగైదు నెలలు జీతం కూడా వేశాడు. ఆపై తన నిజ రూపాన్ని ప్రదర్శించాడు. ఉద్యోగం ఇప్పించానన్న కారణంతో తనతో కలవాలంటూ బలవంతం చేసేవాడు. లేదంటే బెదిరించేవాడు. అతడి ఆగడాలు తట్టుకోలేక ఆ వివాహిత ఏకంగా చనిపోవడానికి సిద్ధపడింది. ఆత్మహత్యాయత్నం చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పాపం పండడంతో ఈ ప్రబుద్ధుడి విషయం ఏకంగా డీఐజీ దృష్టికి వెళ్లింది. దీంతో శనివారం రాత్రికి రాత్రి అతనిపై కేసు నమోదైంది. ఒకటో పట్టణ ఎస్ఐ కృష్ణ చెప్పిన వివరాల మేరకు..

శ్రీకాకుళానికి చెందిన జి.వరాహనరసింహం మాకివలస పీహెచ్‌సీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈయనకు కంపోస్టు కాలనీకి చెందిన ఓ వివాహిత గతంలో పరిచయమైంది. ఈమె అప్పటికి ఈమె గ్లోబల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుండటంతో డీఎంహెచ్ఓలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన వివాహిత ముందు రూ.2 లక్షలు ఇచ్చింది. తర్వాత రూ.లక్ష ఫోన్ ద్వారా పంపించింది. ఉద్యోగం ఇప్పిస్తాననే నెపంతో అసభ్యకరంగా మాట్లాడటమే కాక శారీరకంగా కలవకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈలోగా ఓ ఫేక్ ఆర్డర్ కాపీ చూపించి జాబ్ వచ్చిందంటూ నమ్మించాడు. నాలుగైదు నెలల శాలరీని ఆమె అకౌంటులో వేశాడు. జాబ్‌కు వెళ్లకుండా జీతం ఎలా వచ్చిందంటూ ఆమె అడిగితే.. అదంతా నేను చూసుకుంటా అని చెప్పేవాడు.

అతడి మాటలపై నమ్మకం కుదరక ఆమె డీఎంహెచ్ఓ కార్యాలయానికి వెళ్లడంతో అసలు అలాంటి జాబేమీ రాలేదని తెలిసింది. దీంతో నరసింహంను నిలదీసింది. దీంతో అతను ఆర్డర్ కాపీని తీసుకుపోయాడు. డబ్బులూ పోయి.. జాబూ రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన ఆమె ఆలౌట్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో ఈనెల 19న ఎంఎల్‌సీ నమోదైంది. అయితే డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసిన గోపీనాథ్ జట్టి ఈ విషయంపై ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యుల ద్వారా ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం తెలిసినా కేసు నమోదు చేయకపోవడంపై క్రైమ్ రివ్యూలో సీరియస్ అయ్యారు. దీంతో ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేశారు.

వెలుగుల గణపతి



శ్రీకాకుళం నక్కవీధిలో గణపతిని ఆదివారం నాగావళిలో నిమజ్జనం చేశారు. అనుపు ఉత్సవంలో స్వామి ఇలా బాణసంచా వెలుగుల మధ్య వెలుగులీనారు. - శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు కాశీబుగ్గ యువకుడు


ఛాయా కుమార్

కాశీబుగ్గ: అన్నవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కాశీబుగ్గకు చెందిన గూడిపుడి ఛాయాకుమార్ రాణించాడు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. ఛాయాకుమార్ రాణించడంతో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం, రోహితక్‌లో జరిగే సబ్ జూనియర్ జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఎంపికచేశారు. ఈ సందర్భంగా తండ్రి ఆనందరావు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలుపుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


కె.రమణ

గార: మద్యానికి బానిసైన వ్యక్తి అలవాటును మానుకోలేక, కుటుంబ సభ్యులు మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం అంపోలు కాలనీకి చెందిన కొరుపోలు రమణ (38) గత రెండేళ్లుగా మద్యానికి బాగా అలవాటు పడ్డాడు. సొంత అక్క కూతురిని వివాహం చేసుకున్న రమణను కుటుంబ సభ్యులు తాగవద్దని మందలించేవారు. దీంతో ఆయన మనస్తాపం చెంది శనివారం మద్యంతో పాటు పురుగుమందు తాగడంతో, కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందగా, పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార ఎస్‌ఐ ఆర్.జనార్ధన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టోల్‌గేటు వద్ద తోపులాట


లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద డ్రైవర్, టోల్ సిబ్బంది ఘర్షణ

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌గేటు వద్ద ఆదివారం ఉదయం తోపులాట జరిగింది. విశాఖపట్నం నుంచి బరంపురం వైపు వెళ్తున్న లారీ టోల్‌గేటు వద్దకు చేరుకునే తరుణంలో టోల్‌గేటు సిబ్బంది లారీ ఆపారు. అక్కడే టోల్ సిబ్బంది, లారీ డ్రైవర్లు వాదించుకుని చివరకు దూర్భాషలాడుకున్నారు. అనంతరం పరస్పరం తోపులాట జరిగింది. లారీతో పాటు మిగిలిన వాహనాల డ్రైవర్లు సైతం డ్రైవర్‌కు సపోర్ట్‌గా నిలవడంతో వివాదం పెద్దదై కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో టోల్‌గేటు వద్ద వాహనాలు బారులు తీరాయి.

ముగిసిన వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

అరసవల్లి: జిల్లాలో తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ మేరకు ఆదివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా తెలుగునాడు వైద్యారోగ్య ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా పంగ మోహనరావు, కార్యదర్శిగా ఎ.సత్యనారాయణ, కోశాధికారిగా శేఖర్‌బాబు తదితరులు ఎన్నికయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘ ఎన్నికలు కూడా నిర్వహించగా, జిల్లా అధ్యక్షునిగా పొట్నూరు అప్పారావు, కార్యదర్శిగా ఆర్.సూర్యనారాయణ, మహిళా కార్యదర్శిగా రజియా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కర్రి లక్ష్మీనారాయణ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.భానుమూర్తి, శ్రీనివాసాచార్యులు, మహిళా విభాగఅధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ నల్లి రవికుమార్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కాశీబుగ్గ: మందస మండలం చిన్నకేశుపురం గ్రామానికి చెందిన బొడ్డు సమీర (20) ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మందస పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అత్తింటి వేధింపులు తాళలేక సమీర అనే వివాహిత ఇంటిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మందస ఎస్‌ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

జూదగాళ్ల అరెస్టు

టెక్కలి రూరల్: స్థానిక పెద్ద చేరివీధి సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం టెక్కలి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐ కేశవరావు తన సిబ్బందితో కలసి పేకాట శిబిరం పై దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మెళియాపుట్టి రోడ్డులో గల డమర గ్రామ సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న మరో ఐదుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

మహమ్మారి విస్తరిస్తోంది



- నెమ్మదిగా పల్లెలకు విస్తరిస్తున్న కిడ్నీ వ్యాధి
- పెద్దలంబలో తీవ్రంగా వ్యాధి


కాలనీ మాళువలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శీనమ్మ


కాలనీమాళువలో వినియోగిస్తున్న బావినీరు

సారవకోట: మండలంలోని పెద్దలంబ, దాసుపురం, కాలనీమాళువ, కిడిమి బుడితి గ్రామాల్లో కిడ్నీ వ్యాధి నెమ్మదిగా విస్తరిస్తోంది. ఎక్కువగా పెద్దలంబ గ్రామంలో వ్యాధిగ్రస్తులు కనిపిస్తున్నాయి. గిరిజన గ్రామాలైన దాసుపురం, కాలనీ మాళువల్లో కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారు. పెద్దలంబ గ్రామంలో 20 మంది వరకు ఈ వ్యాధితో బాధ పడుతుండగా ఇందులో ఇద్దరు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఒకరు వారానికి ఒకసారి, మరొకరు వారానికి రెండుసార్లు డయాలసిస్‌కు వెళ్తున్నారు. మిగిలిన వారు వైద్యులను సంప్రదించి మందులు వాడుతున్నారు. ఇప్పటికే 8 మంది వరకు మృత్యువాత పడినట్లు సమాచారం. ఇక్కడి బోర్లు, మంచినీటి బావుల్లో నీరు వినియోగించడం వల్ల వ్యాధి తీవ్రత పెరుగుతోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బోర్లు, బావుల్లో నీటిని పూర్తి స్థాయిలో పరీక్షించకుండా వదిలేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ధర్మలక్ష్మీపురం పంచాయతీ దాసుపురం గ్రామంలో నలుగురు ప్రస్తుతం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వీరిలో ఒకరు డయాలసిస్‌కు వెళ్తున్నారు. ఇప్పటికే ఇక్కడ ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇక్కడ ఉండే నీటి వనరుల్లో పరీక్షలు చేసిన దాఖలాలే లేవని స్థానికులు చెబుతున్నారు. మాళువ పంచాయతీ కాలనీ మాళువ గ్రామంలో ఇద్దరు మృత్యువాత పడగా ప్రస్తుతం మరో ముగ్గురు ఈ వ్యాధి సోకి మందులు వాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి



దాసుపురం, కాలనీమాళువ, పెద్దలంబ గ్రామాల్లో కిడ్నీ వ్యాధుల నిర్ధారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. నీటి నాణ్యత తెలుసుకునేందుకు నాణ్యమైన నీటి పరీక్షలు చేపట్టాలి.

– శోభనాపురం మురళీ, ఎంపీటీసీ, దాసుపురం, సారవకోట మండలం

త్వరలో వైద్య శిబిరాలు



కిడ్నీ వ్యాధుల నిర్ధారణకు త్వరలో ఆయా గ్రామాల్లో అన్ని పరికరాలతో వైద్య బృందాలను తీసుకొచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. స్క్రీనింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– తాడేల శ్రీకాంత్, అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, శ్రీకాకుళం

వంద రోజుల పాలనంతా దగా


దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోసం, దగా, రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారే తప్ప ప్రజా సంక్షేమ పాలన అందించడం లేదని వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షులు దుంపల లక్ష్మణరావు (రామారావు) అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసే దేమీ లేకపోవడంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి తిరుపతి లడ్డూలో నెయ్యిలో కల్తీ ఉందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చేతనైతే ఇచ్చిన హామీలు అమలుచేయాలి, లేకుంటే చేయలేమని చెప్పి సీఎం సీటునుంచి తప్పుకోవాలని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ధరలు పెరిగి పోయాయంటూ దుష్ప్రచారం చేసిన కూటమి ఇప్పుడు ధరల నియంత్రణకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా ఆయిల్ రూ.150కి, బంగాళాదుంపలు రూ.50కి పెంచేసిన ఘనత కూటమిదేనన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడం సరికాదన్నారు. అబద్ధాలతో కాలం గడపడం మానేసి హామీలు అమలుచేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

వాడీవేడిగా నేర సమీక్ష

శ్రీకాకుళం క్రైమ్ : డీఐజీ హోదాలో జిల్లాకు మొదటి సారి వచ్చిన గోపీనాథ్ జట్టి శనివారం రాత్రి వరకు అధికారులతో సమీక్షలు వాడీవేడిగా నిర్వహించారు. జిల్లాలో కొన్ని కీలక కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ల జాప్యం పైన, పోలీసుల అలసత్వంపైన గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. ఉదయం రివ్యూలో పాల్గొన్న డీఐజీ మధ్యాహ్న భోజనం అయ్యాక కూడా నాలుగు గంటల వరకు ఉండి అధికారులను అప్రమత్తం చేశారు. మర్డర్ కేసుల్లో పెండింగ్ చార్జిషీట్లు, పెండింగ్ అరెస్టులే కాక గార బ్యాంకు గోల్డ్ ఇష్యూ ఫైల్ పైన ఓ ముగ్గురు అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలిసింది. ఆయన వెళ్లిపోయాక ఎస్పీ మహేశ్వరరెడ్డి సైతం ఒక్కో అధికారితో పెండింగ్ కేసుల విషయంలో చార్జిషీటు అవ్వనివి, అయ్యి కూడా కోర్టులో సరైన సాక్ష్యాధ్యారాలు ప్రొడ్యూస్ చేయలేక కన్విక్షన్ రానివాటిపై దిశానిర్దేశం చేశారు. ప్రతి విచారణాధికారి టేబుల్ ఇన్వెస్టిగేషన్ కాకుండా సీన్ ఆఫ్ అఫెన్స్‌కు పరిగెత్తాల్సిందేనని లేదంటే వేరే చోటకు బదిలీ అవుతారంటూ కూడా హెచ్చరించినట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రాన్ని ఆనుకొని కొన్ని ప్రాంతాల్లో శాంతిభద్రతలు లోపం (ఫ్యాక్షన్ ఛాయలు) కనిపిస్తున్నందున, అసాంఘిక కార్యకలాపాలను నడుపుతున్న స్థావరాలపైన, జిల్లా రోడ్డు మార్గాల గుండా గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను నిరోధించాలంటే కనీసం 150 షీట్లు అయినా తెరవాల్సిందేనని, ఈ విషయంలో మద్దతు ఇవ్వాలని డీఐజీని ఎస్పీ కోరినట్లు తెలుస్తోంది. ఈ నేర సమీక్ష రాత్రి పదిన్నర వరకు సాగింది. చివర్లో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 43 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు ఇచ్చి ఎస్పీ కాస్త ఉపశమనం కలిగించడం విశేషం.

ఆదిత్యుని సన్నిధిలో జస్టిస్ సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డి దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ రమేష్‌బాబు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. తొలి దర్శనానికి వచ్చిన వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ఈఓ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయంలో పర్వదినాల విశిష్టతను కూడా తెలియజేశారు. తర్వాత అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలను జస్టిస్ దంపతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు, జిల్లా ప్రోటోకాల్ సిబ్బంది పాల్గొన్నారు.

సౌర హోమంలో జస్టిస్ దంపతులు

ఆదిత్యుని సన్నిధిలో ఆదివారం ఉదయం ప్రత్యేక మండపంలో హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి దంపతులు సౌరహోమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు ఉన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్యంగా 2047 విజన్ డాక్యుమెంట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా సమగ్ర అభివృద్దే లక్ష్యంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌లో జిల్లా స్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా ప్రజలు, ప్రజా ప్రతినిధుల సూచనలు సలహాలు స్వీకరిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధన కోసం మండల, జిల్లాస్థాయిలో అభిప్రాయ సేకరణ అనంతరం ఆయా ప్రణాళికలను క్రోడీకరించి జిల్లా స్థాయి ప్రణాళికను అక్టోబరు 15 లోగా ప్రభుత్వానికి అందజేయనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రానున్న ఐదేళ్ల కాలంలో 2024 నుండి 2029 వరకు ఒక విజన్‌తో కూడిన నివేదిక రూపొందించాల్సి ఉందన్నారు. డాక్యుమెంటేషన్‌లో భాగంగా సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు ఐదో తేదీ వరకు నిర్వర్తించాల్సిన కార్యాచరణను వివరించారు. స్వర్ణాంధ్ర-2047 ప్రాముఖ్యతపై పాఠశాల, ఇంటర్మీడియెట్ తదితర కళాశాలల స్థాయిలో వక్తృత్వ క్విజ్ పోటీలు, చర్చాగోష్టులు నిర్వహించేందుకు, పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం 11 ప్రశ్నలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచామని వాటి ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు.

30 మంది రక్తదానం


మందసలో రక్తదానం చేస్తున్న యువతి

కాశీబుగ్గ: మందస మేజర్ పంచాయతీలో ఆదివారం నవతరం సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సూర్యోదయ స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో 28 మంది యువకులు ఇద్దరు మహిళలు రక్తదానం చేసినట్లు నతరం సేవా సంఘం అధ్యక్షుడు మామిడి రవితేజ ఓ ప్రకటనలో తెలిపారు. సేకరించిన రక్తాన్ని పలాసలో ప్రాణదాత బ్లడ్ బ్యాంకుకు అందజేశారు.

463 సార్లు తిరుమల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్:

నగరానికి చెందిన మహంతి శ్రీనివాస్ శుక్రవారంతో 463 సార్లు తిరుమల పాదయాత్రను పూర్తిచేశారు. ఆయన 1996 నుంచి తిరుమతి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్తున్నారు. ఒక్కోసారి రోజుకు మూడు సార్లు కూడా కొండెక్కి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

సర్దుబాటు సమస్యలపై విజ్ఞప్తి


మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: టీచర్ల పని సర్దుబాటులో జరిగిన లోటుపాట్లను విద్యాశాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా నాయకులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అధ్యక్షతన ఆదివారం శ్రీకాకుళంలో ఆ సంఘ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ గత ఆగస్టులో జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు విషయంలో ఉపాధ్యాయుల నుంచి, వివిధ పాఠశాల యాజమాన్య కమిటీల నుంచి మండలాల విద్యాశాఖాధికారుల ద్వారా జిల్లా, రాష్ట్ర అధికారులకు వచ్చిన వినతులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమని మండిపడ్డారు. పని సర్దుబాటును స్టూడెంట్ రోల్‌తో సంబంధం లేకుండా ప్రాథమికోన్నత పాఠశాలల్లో భాషా పండితులను, స్కూల్ అసిస్టెంట్‌లను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న మాట్లాడుతూ గతంలో ఉన్నత పాఠశాలలకు ఇచ్చిన ల్యాప్‌టాప్‌లను తిరిగి అప్పగించాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి చేసి లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వివిధ ఆన్‌లైన్ కార్యకలాపాలైన ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులు, టెన్త్ విద్యార్థుల పరీక్షల దరఖాస్తులు, యు-డైస్ వంటి వాటిని సజావుగా నిర్వహించేందుకు కంప్యూటర్లు, ప్రింటర్లను పాఠశాలలకు అందించడంతోపాటు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తు చేశారు. సమావేశంలో శిల్లా భాస్కరరావు, జి.రాజశేఖర్, సీపాన ధర్మారావు, గండెం రామారావు, గురుగుబెల్లి భాస్కరరావు, మన్యం జిల్లా ప్రధానకార్యదర్శి చింతాడ రఘురామ స్వామి, బాలకృష్ణ, సన్యాసిభట్లు, పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుల సిరి.. వెలగదా మరి



నేషనల్ హైవే నుంచి శ్రీకాకుళం ముఖద్వారం వద్ద వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటుచేసిన వెలుగుల్ని పూర్తిగా వదిలేశారు. శ్రీకాకుళం జిల్లా ప్రఖ్యాత అరసవల్లి సూర్యనారాయణస్వామి సింబల్‌గా ముఖద్వారం వద్ద 'అదిగో ఆదిత్య పురి...శ్రీకాకుళం వెలుగుల సిరి' అనే అక్షరాలు ఇప్పుడు వెలగడం లేదు. నగరాన్ని అందంగా ఉంచాలని ఏర్పాటుచేసిన వాటిపై నూతన కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ చూపించాలని నగరవాసులు కోరుతున్నారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

జాగిలాలతో విస్తృత తనిఖీలు


బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆమదాలవలస: ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు జాగిలాలతో గంజాయి కోసం విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. స్థానిక ఎస్‌ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో బ్యాగులను పోలీసు జాగిలంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ ఆవరణలోని దుకాణాలు, ప్లాట్ ఫారం పరిశీలించారు. బ్రహ్మపుర నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి పొందూరు రైల్వే స్టేషన్ వరకు వెళ్లి రైలులో ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీను చింపివేసిన ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన శాసనసభ్యుడు సంఘ విద్రోహక చర్యలకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులను చట్టసభల్లో అనర్హులుగా పరిగణనలోకి తీసుకుని తక్షణమే ఎమ్మెల్యే పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా కఠిన తరమైన శిక్ష వేయాలని పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో గల 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్లకు స్థాన చలనం చేస్తూ విశాఖపట్నంలో డీఐజీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో కొత్తగా సబ్ రిజిస్ట్రార్లు నియమితులయ్యారు.

సబ్ రిజిస్ట్రార్ పేరు	స్థానం	ఎక్కడ నుంచి
బసవేశ్వరరావు	నరసన్నపేట	అనకాపల్లి
రమాపతి	కోటబొమ్మాళి	పాతపట్నం
ఉమామహేశ్వరరావు	టెక్కలి	మందస
బి.అరుణ	హిరమండలం	ఆమదాలవలస
ఆర్.జగదీశ్వరరావు	ఆమదాలవలస	నెల్లిమర్ల
వి.తులసీదాస్	రణస్థలం	భీమిలి నుంచి

ఖాళీగా ఉన్న స్థానాలివే..

శ్రీకాకుళం-2, పలాస-కాశీబుగ్గ, సోంపేట, మందస, పాతపట్నం, శ్రీకాకుళం-2తో పాటు ఇచ్ఛాపురంలో రిటెన్షన్ అడుగుతున్నట్లు సమాచారం. మరో నలుగురు సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తే ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ కావాల్సిన స్థానం కోసం ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదేళ్ల స్వాతి

కంచిలి:

స్థానిక జాతీయ రహదారిపైన ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జలంత్రకోట గ్రామానికి చెందిన మూలి ప్రదీప్, అతని ఐదేళ్ల కుమార్తె స్వాతి తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి చనిపోయింది. వీరిద్దరూ ఆదివారం ఉదయం మండలంలోని పోలేరు గ్రామంలో వారి బంధువుల ఇంటిలో శుభకార్యానికి హాజరై తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తుండగా, కంచిలి జాతీయ రహదారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా వచ్చేసరికి గుర్తు తెలియని ఏదో వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. తండ్రి, కూతురు ఇద్దరూ తీవ్ర గాయాలపాలై రోడ్డు పక్కన పడి ఉన్నారు. స్థానికులు గమనించి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. స్థానికులే బైక్ పైన మొదట గాయాలపాలైన కుమార్తె స్వాతిని సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. తర్వాత అంబులెన్స్ రావడంతో, ప్రదీప్‌ను కూడా తీసుకెళ్లారు. తలకు దెబ్బలు తగలడంతో అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ చిన్నారి స్వాతి చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు


ఏపీటీఎఫ్ సంఘ పోరాట ధీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ వేదికగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(1938) 80 వసంతాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిని మించిన మహోన్నత వృత్తి మరొకటి లేదని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకుడు చౌదరి పురుషోత్తమనాయుడు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం తప్ప మరే సమస్యల పరిష్కారంపై సానుకూలత చూపించలేదన్నారు. ప్రభుత్వంపై త్వరలోనే ఒత్తిడి తెచ్చి ఐఆర్, పీఆర్సీ సాధించుకోవాల్సి ఉందన్నారు. ఇవే ప్రధాన అంశాలపై త్వరలో ముఖ్యమంత్రిని కలవనున్నామని చౌదరి చెప్పారు. ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల ఐక్యతను దెబ్బతీసే ప్రభుత్వ వ్యక్తులను గుర్తించాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ సంఘాలు అంటే ప్రభుత్వాలకు యావగింపుగా తయారైందని, ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య మాట్లాడుతూ నిరంతరం నేర్చుకోవడం, నేర్పించడమే ఉపాధ్యాయుని ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అంతకు ముందు ఏపీటీఎఫ్ సంఘ పోరాటధీరుల చిత్రపటాలకు అతిథులు, సంఘ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డీవైఈఓ పి.విలియమ్స్, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, ఏపీటీఎఫ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా గౌరవ అధ్యక్షులు చింతాడ దిలీప్‌కుమార్, చలపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.